క్లుప్తంగా

శ్రీశైల దేవస్థాన వైద్యశాలకు పరికరాల విరాళం



ఈఓకు వైద్యపరికరాలను అందజేస్తున్న దాత సిద్దార్థ్‌రెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశాలకు హైదరాబాద్‌కు చెందిన ఇందుకూరి సిద్దార్థ్‌రెడ్డి వైద్యపరికరాలను విరాళమిచ్చారు. రూ.4లక్షల విలువ చేసే వైద్య పరీక్షల పరికరాలను శుక్రవారం దేవ స్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావుకు అందజేశారు. దాతకు ఈఓ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంబంధాల అధికారి టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు గంజి రవి, ఎం.శ్రీనివాసరావు, అపోలో వైద్యులు సాయికిషన్, సంఘమేష్ పాల్గొన్నారు.

బంగారు వస్తువుల వితరణ



బంగారు వస్తువులను అందజేస్తున్న తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్విత్‌రెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి శుక్రవారం అనంతపురం జిల్లా తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్విత్‌రెడ్డి, జేసీ ప్రభాకరరెడ్డి కుటుంబ సభ్యులు 379 గ్రాముల బంగారు కూర్మ సింహాసనం, 249 గ్రాముల పళ్లెమును విరాళమిచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు బంగారు వస్తువులను ఈఓ ఎం.శ్రీనివాసరావు, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయస్వామిలకు అందజేశారు. దాతలకు దేవస్థానం తరపున స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఏఈఓ బి.మల్లికార్జునరెడ్డి, పీఆర్వో టి.శ్రీనివాసరావు ఉన్నారు.

శుభకార్యం



బండి ఆత్మకూరు: ఇంటెలెక్చువల్ ఫోరం శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షుడు ఇటికెలా చిన్న వెంకటసుబ్బారెడ్డి మనుమడి పెళ్లి వేడుకలు శుక్రవారం నంద్యాల పద్మ నంది ఆలయంలో ఘనంగా జరిగాయి. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, బుడ్డా శేషారెడ్డి, శిల్పా భువనేశ్ రెడ్డి, గంగుల ప్రతాప్ రెడ్డి తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నులిపురుగుల నిర్మూలనే లక్ష్యం



ఎంపీడీఓ మేరికి ఆల్బెండజోల్ మాత్రలను ఇస్తున్న వైద్యాధికారులు

కొత్తపల్లి: నులిపురుగుల నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీఓ దాసరి మేరి సూచించారు. శుక్రవారం ఎర్రమఠం వైద్యాధికారి జబీర్‌బాషా, కొత్తపల్లి వైద్యాధికారి మహమ్మద్ బేగ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యులు గ్రామాల్లోని ప్రజలను కలసి నులిపురుగుల నివారణ గురించి వివరించాలన్నారు. ఈనె 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓకు వైద్యులు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐ, ఆర్‌టీఓ

శ్రీశైలం: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ ప్రసాదరావు, ఆత్మకూరు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం శ్రీశైలానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ముఖ ద్వారం వద్ద రోడ్డు నిబంధనల కరపత్రాలను ఆవిష్కరించారు. వాటిని వాహనదారులకు, ప్రయాణికులకు పంపిణీ చేశారు. శ్రీశైలం – దోర్నాల, మన్ననూర్ – శ్రీశైలం ఘాట్ రోడ్లలో సరుకు రవాణా వాహనాల్లో ప్రయాణికులను తరలించరాదన్నారు. దేవస్థానం టోల్‌గేట్ వద్ద ట్రాలీ వాహనదారులకు సూచనలు తెలియజేస్తూ బ్యానర్లను ఏర్పాటు చేశారు.

అడుగుకో గుంత.. ఎదుటి వాహనానికి దారి ఇచ్చే అవకాశం లేని దుస్థితిలో రోడ్లు.. అయినా అటు అధికారులు కానీ.. ఇటు ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. కొత్త రోడ్ల సంగతి పక్కన పెట్టి కనీసం మరమ్మతులకు కూడా కూటమి ప్రభుత్వం పూనుకోకపోవడం ×ఇదేమి దారిద్ర్యమో అంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లింగాపురం వద్ద బురద మయంగా ఉన్న సంగమేశ్వరం - ఆత్మకూరు ప్రధాన రహదారి



ఇదేమి దారిద్ర్యం?

- గుంతలమంగా పల్లె రోడ్లు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

కొత్తపల్లి: మండలంలోని 32 గ్రామాల ప్రజలు ప్రతిరోజు అవసరాల నిమిత్తం ఆత్మకూరు పట్టణానికి వందల సంఖ్యలో వాహనాల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఆత్మకూరు నుంచి సంగమేశ్వర క్షేత్రం వరకు సుమారు 40 కిలోమీటర్ల రహదారి మొత్తం గుంతల మయంగా మారింది. ఒక వైపు పూర్తిగా దెబ్బ తినడంతో ఎదురుగా వస్తున్న వాహనాలకు దారి ఇచ్చేందుకు కూడా వీలు లేని పరిస్థితి నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తుల రాక..

రాష్ట్రంలోనే అత్యంత పురాతన పుణ్యక్షేత్రాలు మండలంలో రెండు ఉన్నాయి. ఒకటి తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో కృష్ణనది తీరప్రాంత సమీపంలో సంగమేశ్వర క్షేత్రం, రెండవది నల్లమల్ల అడవుల్లో ఉన్న కొలను భారతి క్షేత్రం. ఈ ఆలయాలను దర్శించుకునేందుకు ప్రతి నిత్యం రెండు తెలుగు రాష్ట్రాల నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు.



నందికుంట గ్రామం వద్ద దెబ్బతిన్న రోడ్డుపై ప్రమాదకరంగా వెళ్తున్న బైకులు



గుంతలతో అధ్వానంగా మారిన దుద్యాల - ఆత్మకూరు రహదారి

మండల ప్రజలు కూడా కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాలకు చేరుకోవాలంటే ఆత్మకూరు మీదుగా గుంతల మయంగా ఉన్న ఇదే రహదారిపైనే ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గుంతలకు మరమ్మతులు చేయాల్సిన రోడ్లు, భవనాల శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తోందని వాహనదారులు విమర్శిస్తున్నారు.

భారీ వాహనాలను నిరోధించేదెవరు

జాతీయ రహదారి నిర్మాణం కోసం నందికుంట గ్రామ శివారులో ఉన్న మట్టిని తరలిస్తున్న భారీ వాహనాల్లో ఇదే రహదారి గుండా తరలిస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో రహదారి పూర్తిగా దెబ్బ తినింది. ఆత్మకూరు నుంచి వస్తున్న తరుణంలో నందికుంట గ్రామ శివారులో ఉన్న ఆంజనేయస్వామి టెంపుల్, జమ్మి చెట్టు సమీపంలో ఉన్న మలుపు వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతిని ఒకవైపు ఎత్తు మరోవైపు గుంతలుగా మారింది. అలాగే నందికుంట గ్రామంలోకి వెళ్లే రోడ్డంతా గుంతల మయంగా మారి నందికుంట దాటిన తర్వాత సుంకులమ్మ గుడి సమీపంలో, బావాపురం గ్రామ సమీపంలో గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించి ప్రయాణికులు ప్రమాదాలకు గురికాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నందికుంట గ్రామంలో మట్టితో వెళ్తున్న టిప్పర్

నేడు విద్యుత్ కోత

మండలం	విద్యుత్ కోత సమయం
శ్రీశైలం	ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
ఆత్మకూరు	ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు
కొత్తపల్లి	ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు
పగిడ్యాల	ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు
మహానంది	ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు

పరిహారం ఇచ్చేందుకు అంగీకారం

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: పంట నష్టానికి పరిహారం ఇస్తామని కాంట్రాక్టర్లు ఫోన్ చేసి చెప్పినట్లు బాధిత రైతులు నాగస్వామి, సూర్యభగవాన్‌రెడ్డి, శివకృష్ణారెడ్డి, బాలపుల్లయ్య తెలిపారు. 'పచ్చని పంటల ధ్వంసం' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి కాంట్రాక్టర్లు స్పందించారు. పంటనష్టానికి పరిహారం చెల్లిస్తామని పేర్కొంటూ పవర్‌గ్రిడ్ కాంట్రాక్టర్లు తమకు ఫోన్ చేసి తెలియజేసినట్లు బాధిత రైతులు తెలిపారు. తమ కష్టాన్ని ప్రతికలో ప్రచురించి అండగా నిలిచినందుకు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

పైపు లైన్ల మరమ్మతులు

పాములపాడు: తుమ్మలూరు గ్రామంలో ప్రధాన వీధిలో పైపు లైన్ల మరమ్మతులను శుక్రవారం సర్పంచ వరప్రసాదరావు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు ఎక్కువ కావడంతో పైపు లైన్లు లీకై నీరు వృథాగా పారుతోందన్నారు. దీంతో ప్రధాన రహదారి బురదమయంగా మారి ప్రజలకు ఇబ్బందులేర్పడుతుండటంతో వెంటనే మరమ్మతులు చేయించినట్లు చెప్పారు.

కమనీయం..సీతారాముల కల్యాణం



రథం లాగుతున్న భక్తులు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవరాయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. ఉదయం స్వామి వారికి అభిషేకం, కలశ పూజ, మన్యసూక్త హోమం తదితర కార్యక్రమాలను నరహరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరామిరెడ్డి, కమిటీ సభ్యులు వంగాల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం

స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను గావించి మేళతాళాలతో రథం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం రథంపై కొలువుంచి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తజనుల జయజయ ధ్వానాల మధ్య రథోత్సవం సాగింది. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ ఓబులేసు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కొక్కెరంచలో ప్రత్యేక గ్రామ సభ

కొత్తపల్లి: మండలంలోని కొక్కెరంచ గ్రామంలో తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో హంద్రీనీవా సుజల స్రవంతి యూనిట్-4 అధికారులు శ్రీశైలం జలాశయం నిర్మాణంలో భూములు కోల్పోయి నష్ట పరిహారం పొందని రైతుల వివరాల సేకరణకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అప్పటి జలాశయం నిర్మాణంలో భూములు కోల్పోయి ఇప్పటి వరకు నష్టపరిహారం పొందని రైతులు ఉన్నారన్నారు. అధికారులకు వారి వివరాలను ఇస్తే పరిహారం అందేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామ సభలో హెచ్‌ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు రిటైర్డ్ తహసీల్దార్ విజేయుడు, సర్వే డీఐ శివశంకర్, డిప్యూటీ తహసీల్దార్ తాసీన్ అహమ్మద్, ఆర్ఐ సుందరరావు, వీఆర్వో వేణుగోపాల్ పాల్గొన్నారు.



నష్టపరిహారం పొందని రైతుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

గోశాల చుట్టూ ఆరడుగుల ఫెన్సింగ్



ఏఈఓకి సూచనలిస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానందిలోని గోశాల వద్ద గోవుల సంరక్షణ కోసం ఆరు అడుగుల ఎత్తులో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఏఈఓ ఎరమల మధు, ఏఈ శ్రీనివాసులుతో కలిసి దేవస్థానం గోశాల వద్ద శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఫెన్సింగ్ స్థానంలో నూతన కంచెను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. శివరాత్రి సమీపిస్తున్న నేపథ్యంలో ఎప్పటి పనులు అప్పుడే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అర్చకులు మూలస్థానం సుబ్బయ్య, పడితరం ఇన్‌చార్జ్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

ఈసీజీ ద్వారా గుండెపోటును గుర్తించాలి

నందికొట్కూరు: ఈసీజీ ద్వారా గుండెపోటును గుర్తించాలని జిల్లా వైద్యశాఖ కో ఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను జిల్లా వైద్యశాఖ కో ఆర్డినేటర్ తనిఖీ చేశారు. వార్డులో అందుతున్న వైద్యం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల హాజరు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాతి నొప్పి, ఆయాసం, స్పృహ కోల్పోవడం, గుండె దడ వంటి లక్షణాలతో వచ్చిన రోగులకు వెంటనే ఈసీజీ తీయాలన్నారు. ఈసీజీ ద్వారా గుండెపోటును గుర్తించి అత్యవసరమైన ఇంజెక్షన్ ఇచ్చి వారి ప్రాణాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు, హెడ్ నర్స్ భువనేశ్వరి ఉన్నారు.

మెరుగైన సేవలందించాలి

మిడుతూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నంద్యాల జిల్లా హెల్త్ సర్వీసెస్ కో ఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా సూచించారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు బయటకు రాయకూడదన్నారు. ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి రికార్డులు, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి తిరుపతి, భరత్, శారద, లీనా, ల్యాబ్‌టెక్నిషియన్ సత్యనారాయణ, ఫార్మాసిస్టు మాదన్న ఉన్నారు.



రోగులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖ కో ఆర్డినేటర్ జఫ్రుల్లా

ఇళ్లస్థలాల కోసం 10న ఆందోళన

జూపాడుబంగ్లా: పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఈనెల 10న తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఐ నాయకుడు రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చాబోలు, 80 బన్నూరు, సిద్దేశ్వరం గ్రామాల్లోని పేదలు, చెంచులతో పాటు అన్ని గ్రామాల్లోని ఇళ్ల స్థలాల్లేని పేదలకు జూపాడుబంగ్లాలో స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు.

పల్లకీలో విహరించిన మహానందీశుడి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతు శర్మ, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవాన్ని చేపట్టారు. మహాధ్వజ స్తంభం వద్ద స్వామి, అమ్మవార్లకు హారతులు ఇచ్చి తిరిగి అలంకార మండపానికి చేర్చారు.

రుణాల దరఖాస్తుకు గడువు పెంపు

జూపాడుబంగ్లా/పాములపాడు: బీసీ, ఈబీసీ, కమ్మ, కాపు, తెలగ తదితర కార్పొరేషన్ల ద్వారా రుణం పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచినట్లు జూపాడుబంగ్లా, పాములపాడు ఎంపీడీఓలు గోపికృష్ణ, చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ ఆన్‌లైన్ గడువు నేటితో ముగియనుండగా ఈనెల 12 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పదో తరగతి పరీక్షలపై భయం వీడాలి

ఆత్మకూరు: పదో తరగతి పరీక్షలపై విద్యార్థులు భయం వీడాలని సీఐ రాము, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఎస్‌వీ డైరెక్టర్ సాయిప్రణీత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక థెరిస్సా జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాస పరీక్షలను పదో తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా ప్రతిఒక్కరూ పబ్లిక్ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు సాయిప్రశాంత్, ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, అంజి, దిలీప్, రవి, చిన్న, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడిన కోళ్లబావాపురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ బొల్లి భారతిపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన బొల్లి గోపాల్, ఆంజనేయులు శుక్రవారం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పనులకు రాకపోయినా బినామీ పేర్ల బ్యాంక్ అకౌంట్‌లో నగదు జమ చేసి రూ.1,49,299 ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడిందన్నారు. విచారణలో నిర్ధారణ అయినా కేవలం రూ.26,299, జరిమానా రూ.6 వేలు రికవరీ చేసి అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. ఇప్పటికైనా అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తులంతా కలిసి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పీఎంఏజీవైకు వేంపెంట ఎంపిక



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామం ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామీణ యోజన(పీఎంఏజీవై)కు ఎంపికైనట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం గ్రామంలో సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో దళితుల జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం వేంపెంట గ్రామాన్ని ఎంపిక చేసిందన్నారు. ఉమ్మడి జిల్లాలోని 22 మండలాల్లోని 22 గ్రామాలు ఎంపికయ్యాయని, అందులో వేంపెంట కూడా ఒకటని చెప్పారు. ఆయా గ్రామాల్లోని దళిత కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేయనుందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగు నీటి వసతుల ఏర్పాటుకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

భక్తులకు దోమల బెడద

మహానంది: మహానందికి వచ్చిన భక్తులు కోనేరుల్లో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్న తర్వాత వారిలో ఉండే ఆనందం క్షణాల్లో మాయమైపోతుంది. దోమల తీవ్రత ఎలా ఉందంటే...ఆలయంలోకి వెళ్లి ప్రశాంతంగా మహానందీశ్వరస్వామిని దర్శించునే భాగ్యం లేకుండా చేస్తున్నాయి. చీకటి పడితే చాలు ఆలయ ప్రాంగణంలో దోమలు విపరీతంగా ఉండటంతో కూర్చోవడానికి లేదు, నిల్చోవడానికి లేకుండా పోతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా దోమల మహా దండయాత్రతో క్షణం నిలుచోలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు మెరుగు పరచడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లించి, దోమల నివారణ కోసం ఉపయోగించే ద్రావణాలను పిచికారీ చేయించాలని భక్తులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



దోమల నుంచి రక్షణ కోసం పెట్టిన పొగలో భక్తులు

నేరాల జోలికెళ్లొద్దు

ఆత్మకూరురూరల్: నేరాల జోలికెళ్లొద్దని డీఎస్పీ రామాంజి నాయక్ కురుకుంద గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన గ్రామ సభలో ఆయన తన సిబ్బందితో కలిసి పాల్గొని ప్రసంగించారు. సెల్ ఫోన్‌లు వినియోగించే వారు గుర్తు తెలియని మెసేజ్‌లకు, ఓటీపీలకు స్పందించవద్దన్నారు. కాలినడకన వెళ్లే మహిళలే లక్ష్యంగా దొంగలు ద్విచక్రవాహనాలపై గొలుసులు లాక్కెళ్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. సభలో సీఐ రాము, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ, మహా మంగళ హారతులు తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా ముస్తాబు చేసిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ పాల్గొన్నారు.



పంచాయతీ నిధులివ్వాలని ఎమ్మెల్యే వర్గీయులు వేధిస్తున్నారు

- వార్డు సభ్యుల సమావేశంలో కంటతడి పెట్టుకున్న సర్పంచ్ రాజేశ్వరి

పగిడ్యాల: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయ భవన సముదాయాల ప్రారంభోత్సవానికి పంచాయతీ నిధుల నుంచి రూ.1.50 లక్షలు ఇవ్వాలని, లేదంటే చెక్ పవర్ రద్దు చేయిస్తామని ఎమ్మెల్యే వర్గీయుడు శ్రీనాథ్‌రెడ్డి వేధిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని దళిత సర్పంచ్ రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని నెహ్రూనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన వార్డు సభ్యుల సమావేశాన్ని పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 24 లక్షలు మంజూరు కాగా రూ.1.50 లక్షలు సచివాలయ భవనాల ప్రారంభోత్సవానికి ఇవ్వాలని ఎమ్మెల్యే, ఎంపీడీఓ చేత ఒత్తిడి చేయిస్తున్నాడని వాపోయారు. ఇవ్వకపోతే చెక్ పవర్ రద్దు చేయిస్తానని బెదిరిస్తున్నాడని, దళిత సర్పంచ్‌ను కాబట్టే తనపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని వార్డు సభ్యుల ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు. కాగా పంచాయతీ నిధులు గ్రామాభ్యుదయానికి మాత్రమే ఉపయోగించాలని, ఎవ్వరికి ఇవ్వరాదని వార్డు సభ్యులు సర్పంచ్‌కు మద్దతు పలికారు.



ఎమ్మెల్యే వర్గీయులు వేధిస్తున్నారని వాపోతున్న సర్పంచ్ రాజేశ్వరి